క్లుప్తంగా

నేడు వాహనాల వేలంపాట

రాయచోటి టౌన్ : రాయచోటి ఎక్సైజ్ పోలీస్ కార్యాలయంలో నేడు (బుధవారం) ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక కారు, ఒక స్కూటర్‌కు మాత్రమే వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు రాయచోటి ఎస్ఎన్ కాలనీలోని ఎస్ఈబీ స్టేషన్‌లో వేలం జరుగనుందని పేర్కొన్నారు.

సిద్దవటం ఇన్‌చార్జి రేంజర్‌గా ఓబులేసు



సిద్దవటం : సిద్దవటం ఇన్‌చార్జి రేంజర్‌గా డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ, అటవీ సంపద కాపాడటం అందరి బాధ్యతని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. భూమి మీద మనుషులతో పాటుగా ఎన్నో రకాల జంతువులు ఉన్నాయన్నారు. వాటిని సంరక్షించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అంతేగాకుండా ఈ ప్రాంతాల్లో మానవాళికి ఉపయోగపడే ఎన్నో ఔషధమైన మొక్కలు ఉన్నాయని వాటిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాము అటవీ సంపదను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం రాయచోటి ఎన్‌జీఓ హోంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య, రాష్ట్ర కో–కన్వీనర్ ఎస్. రామాంజనేయులుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్‌గా ఏ. శ్రీనివాసులు, కో–కన్వీనర్‌గా ఏ.అశోక్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఏఐఎస్ఏకు నూతన కమిటీ ఎంపిక

రాయచోటి అర్బన్ : ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) రాయచోటి ఏరియా కమిటీకి మంగళవారం నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ అధ్యక్షతన రాయచోటిలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.సతీష్‌కుమార్, షేక్ సమీర్, ఉపాధ్యక్షుడిగా సికిందర్, సహాయ కార్యదర్శిగా సునీల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

పుల్లంపేట : మండలంలోని అనంతంపల్లి వద్ద జానకీపురం గ్రామానికి చెందిన యానాది(50) అనే వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో కాలికి తీవ్ర గాయమైంది. దీంతో బాధితుడిని చికిత్స నిమిత్తం 108లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు



గుండ్లచెరువు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఉషశ్రీ

గాలివీడు : విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి, విధుల పట్ల వ్యవహరించాల్సిన తీరుతెన్నులపై పలు సూచనలు చేశారు. పీఎంఎస్ఏ, ఐడీసీఎఫ్ తదితర పథకాల అమలు గురించి డాక్టర్ రిజ్వాన్‌ను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అనంతరం గుండ్లచెరువు సచివాలయాన్ని సందర్శించి ఐసీడీఎఫ్ ప్రోగ్రాం, ఆర్సీహెచ్, హెల్త్ ఐడీఎస్ మీద సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాపునాడు సంఘం అధ్యక్షుల నియామకం

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలం జంగిటివారిపల్లె చెందిన జెట్టి హరీష్‌బాబును రైల్వేకోడూరు నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగాను, అలాగే పట్టణానికి చెందిన మందల పవన్ సాయిని రైల్వేకోడూరు మండల యూత్ అధ్యక్షులుగా నియమించి కాపునాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు విపి నారాయణస్వామి చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నట్లు మంగళవారం వారు తెలిపారు. నూతన నియామకం పట్ల వైఎస్సార్ కడప ఉమ్మడి జిల్లా కాపునాడు జిల్లా ఉపాధ్యక్షుడు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా జాతర

గుర్రంకొండ : మండలంలోని గంగిరెడ్డిపల్లెలో శ్రీనలవీరగంగమ్మతల్లి జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు బోనాలు సమర్పించారు.

సేంద్రియం.. లాభదాయకం

- రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్
- సేంద్రియంతో పంట దిగుబడి పెరుగుదల



సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

రైల్వేకోడూరు : రసాయనిక ఎరువుల వినియోగంతో కలిగే అనర్థాలపై విస్తృతంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు సేంద్రియ ఎరువులను వినియోగించే సాగుచేసేవారు. అయితే అధిక దిగుబడుల సాధన కోసం రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. దీర్ఘకాలం రసాయన ఎరువులు వినియోగిస్తే భూసారం క్షీణించడంతో పాటు భూమి సారవంతం కోల్పోతుంది. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం తగ్గి పంట దిగుబడులు పడిపోతుండటం, ఖర్చులు ఎక్కువ అవుతుండటంతో సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు మొగ్గు చూపుతున్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ప్రత్యేక అధికారులను సహితం నియమించింది. వీరు గ్రామాలలో రైతులను ఎంపిక చేసుకుని వారి సమక్షంలో సేంద్రియ పద్ధతిలో పంటలు సాగుచేయిస్తున్నారు. భూసారం పెంపుదలకు సేంద్రీయ ఎరువులైన పశువుల పేడ, కోడిపెంట, చీకిన గడ్డితో పాటు చెరువులు, కుంటల్లోని పూడికమట్టిని పొలాలకు తరలిస్తున్నారు. దీర్ఘకాలంగా రసాయన ఎరువుల వాడకం వలన భూసారం తగ్గిపోయి పంట దిగుబడులు తగ్గుతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మరో పక్క రసాయనిక ఎరువుల అధిక వినియోగంతో పంట ఉత్పత్తులు విషతుల్యమవుతున్నాయని ఆహార పరిశోధన సంస్థలు తెలియజేస్తున్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలిచ్చే సేంద్రియ ఎరువులనే వాడాలని రైతులు నిర్ణయించుకుంటున్నారు. పశువుల పేడను పొలాల్లో చల్లుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలోని రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి మండలాలల్లో వందలాది మంది రైతులు సేంద్రియ సాగుపైనే మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా పంట దమ్ముకు ముందే సేంద్రియ ఎరువులను పొలాల్లో వేసి కలియదున్నితే త్వరగా మట్టిలో కలిసిపోయి మంచి ఫలితాలు వస్తాయని రైతులు చెబుతున్నారు.

సేంద్రియంతో పలు ప్రయోజనాలు

సేంద్రియ ఎరువుల వాడకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. పశువుల ఎరువులను పంటపొలంలో వేసి కలియ దున్నడంతో భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయి. వీటిని ఉపయోగిస్తే భూమిలో తేమశాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోకుండా ఉండేందుకు దోహదపడతాయి. సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో చీడపురుగులు, తెగుళ్ల బెడద చాలా తక్కువగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు.

తెగుళ్లు దూరం



సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం వలన తెగుళ్లు చాలా వరకు దూరం అవుతున్నాయి. పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువగా వస్తుంది. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించడం వలన ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంటలను ప్రజలకు అందించవచ్చును. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది.

– రామసుబ్బారెడ్డి, రైతు, ఎస్.ఉప్పరపల్లె

సేంద్రియంతో అధిక దిగుబడులు



సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేయడం వలన నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు. రసాయనిక ఎరువుల వలన భూమి సాంద్రత కోల్పోయి క్షీణించిపోతుంది. అందుకే రైతులు చాలా వరకు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గుచూపుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.

– సుబ్బరామరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, రైల్వేకోడూరు

క్రీడలతోపాటు చదువులోనూ ప్రతిభ చూపాలి



బ్రిడ్జిపనులను పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు : క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల స్నేహభావం పెంపొందుతుందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం రాఘవరాజుపురం క్రీడా మైదానంలో జరుగుతున్న జిల్లా స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని పెంచుతాయన్నారు. గ్రామాలలో క్రీడలు మనుషుల మధ్య అంతరాలు తగ్గించి స్నేహభావాన్ని పెంచుతాయన్నారు. క్రీడలతో పాటు చదువులలో మంచి ప్రతిభ చూపాలని తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న రుద్దిరాల రమణ, కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం నిర్వాహకులు కొరముట్లను సన్మానించారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి, నిమ్మకాయల మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు జనార్దన్‌రాజు, బండారు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనుల పరిశీలన

మండలంలోని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు స్వగ్రామమైన రెడ్డివారిపల్లెలో రూ.12 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఇబ్బందులు, సమస్యలు ఏమైనా ఎదరవుతున్నాయా అని ఆరాతీశారు. వేగవంతంగా పనులను పూర్తిచేసి వీలైనంత త్వరగా ప్రజలకు బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని వారికి సూచించారు. జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సీహెచ్.రమేష్, అధికారులు పాల్గొన్నారు.

నివాళి

త్రివేణి కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న అనంతరాజుపేట బీసీ కాలనీకి చెందిన వెంకటేష్ మంగంపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం బీసీకాలనీలో వెంకటేష్ మృతదేహానికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు.

పశుబీమాను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డా.వెంకటరమణయ్య

సిద్దవటం : పాడి పశువుల రైతులు అందరూ వైఎస్ఆర్ పశు బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ వెంకటరమణయ్య తెలిపారు. సిద్దవటం పశువుల ఆసుపత్రిలో మంగళవారం పశుసంవర్ధక శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ పశు బీమా కింద ఒక్కొక్క పశువుకు రూ. 384 రైతులు చెల్లిస్తే మిగిలిన డబ్బులు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ప్రమాదవశాత్తు పశువు మరణిస్తే రూ. 30 వేల వరకు బీమా వర్తిస్తుందన్నారు. అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిద్దవటం అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక ఒక వరం



పుల్లంపేట: విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న సర్పంచ్ పిచ్చిరెడ్డి



రామాపురం: కిట్లను అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి

రామాపురం : జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఒక వరం అని కె.వి.పల్లె ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి అన్నారు. మంగళవారం మండలంలోని కొండావాండ్లపల్లె ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుకను విద్యార్థులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్యను అందిస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు నాణ్యమైన విద్యను అందిస్తున్న కారణంగా విద్యార్థులు దీనిని సద్వినియోగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యాకానుక కిట్లను అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ భానుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండల పరిధిలోని కోనెయ్యగారిపల్లి పంచాయతీలో సర్పంచ్ నాగా పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను పాఠశాలలు తెరిచిన వెంటనే అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి లక్ష్యాలను సాధించాలన్నారు.

నందలూరులో..

నందలూరు(రాజంపేట) : నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అంజేసినట్టు ఉప సర్పంచ్ ఇబ్బు మోడపోతుల రాము తెలిపారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత పదవులను పొందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రౌఫ్ బాషా, శివకుమార్‌రెడ్డి, కొండమూర్తి వరప్రసాద్, రామక్రిష్ణ, పుణ్యవతి, సరోజినీదేవి, రాఘసుధ, రజని, విమలమ్మ, శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో బ్రహ్మోత్సవాలు

- భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని సౌకర్యాల కల్పన
- 17న సౌమ్యనాథుడి బ్రహ్మోత్సవాల నిర్వహణపై కో–ఆర్డినేట్ మీట్



టీటీడీ అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు

నందలూరు(రాజంపేట) : అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈనెల 27 నుంచి వైభవంగా సౌమ్యనాథుడి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ నటేష్ బాబు తదితర టీటీడీ అధికారుల బృందంతో కలిసి ఆలయంలో కలియ తిరిగారు. ముందుగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో విద్యుత్ సౌకర్యం, క్యూలైన్, విద్యుద్దీపాలంకరణతో పాటు భక్తుల రద్దీని దృష్ట్యా చేపట్టాల్సిన ఏర్పాట్లపై నిర్ణయించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో తాగునీటి కుళాయిలు ఏర్పాటుతోపాటు కల్యాణంరోజున అన్నదానానికి అవసరమైన సౌకర్యాల కల్పనపై దృష్టి సారించారు. ఈనెల 17న బ్రహ్మోత్సవాల నిర్వహణపై కో–ఆర్డినేట్ మీట్ నిర్వహించనున్నారు.

నందలూరులో ఆధ్యాత్మిక వాతవరణం

నందలూరు పురవీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా టీటీడీ ఏర్పాట్లు చేసే దిశగా సూచనలు, సలహాలను అందజేశారు. ఆలయం నుంచి బస్టాండులోని సౌమ్యనాథ ఆర్చి వరకు నిత్యం స్వామివారిపై కీర్తనలు, గోవింద నామస్మరణాలు వినిపించేలా మైకులు దారిపొడవునా ఏర్పాటు చేయనున్నారు. అలాగే నందలూరులో విద్యుద్దీపాలతో దేవతమూర్తుల కటౌట్‌లను ఏర్పాటు చేయనున్నారు.

కేంద్ర పురావస్తు శాఖ అడ్డంకులకు పరిష్కారం

సౌమ్యనాథాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం చేపట్టాల్సిన కొన్ని అభివృద్ధి పనులకు కేంద్ర పురావస్తుశాఖ నిబంధనలు అడ్డంకిగా మారాయని టీటీడీ సిబ్బంది వాపోయారు. దీనిపై ఎంపీపీ జిల్లా కేంద్ర పురావస్తు శాఖాధికారి బాలకృష్ణారెడ్డితో మాట్లాడారు. నిబంధనలు అనుసరిస్తూ సివిల్, ఎలక్ట్రికల్ పనులు చేపడుతామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ డిప్యూటీ ఈఈ నాగరాజు, జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లం రాచపల్లె సుబ్బారెడ్డి, కాకిచంద్ర, టీటీడీ ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్ శాఖ, టీటీడీ విజిలెన్స్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలకు పంపించండి



పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ పద్మావతి

లక్కిరెడ్డిపల్లె : మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం కోనంపేట, పర్వతరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం చేయించారు. పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. ప్రభుత్వం అందించిన కిట్లను పిల్లలకు అందించారు. పుస్తకాలతో ప్రదర్శనలు చేయించారు. అంగన్ వాడీ కేంద్రాలలో చదివిన ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించి ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు దాద్‌బీ, అరుణకుమారి, అరుణాదేవి, హైమావతి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

కొమ్మలు కత్తిరించి దిగుబడిని సాధించండి



ముదురు మామిడి చెట్లలో కలుపుతీతపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారిణి నాగమణి

లక్కిరెడ్డిపల్లె : ముదురు మామిడి తోటలలో గాలి, వెలుతురు పడేటట్లు కొమ్మల కత్తిరింపులు చేపడితే వచ్చే ఏడాదికి రైతులు మంచి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని లక్కిరెడ్డిపల్లె ఉద్యానశాఖ అధికారిణి టి.నాగమణి పేర్కొన్నారు. మండలంలోని కోనంపేట, బి.ఎర్రగుడి, దప్పేపల్లి గ్రామాల రైతులకు మామిడి పంటలో కాయలకోత తర్వాత ఆచరించాల్సిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై మంగళవారం రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి తోటలో కాయలు కోసేటప్పటి నుంచి తగు జాగ్రత్తలు పాటించినట్లయితే నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. కాయలు కోసిన తరువాత 15–20 రోజులు చెట్లకు విశ్రాంతినిచ్చిన తరువాత కొమ్మల కత్తిరింపులు చేపట్టాలన్నారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి లోపలికి ప్రసరించేలా తలపైన కొమ్మలను తూర్పు, పడమర దిక్కులలో మాత్రమే కత్తిరించి కొమ్మలకు ఉన్న ఎండుపుల్ల, చీడపీడలు ఆశించిన కొమ్మలు, తొడిమ కొమ్మలను కత్తిరించి తొలగించాలన్నారు. కత్తిరింపులు చేసిన వెంటనే కొమ్మలు కొమ్మ భాగానికి, చెట్టు పూర్తిగా తడిచేలా 3 గ్రాముల కాఫర్ ఆక్సి క్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తొలకరి వర్షాలు పడగానే వాలుకు అడ్డంగా దుక్కులు దున్నాలన్నారు. దున్నకాలు చేపట్టడం ద్వారా వర్షపు నీరు భూమిలో ఇంకి తేమ శాతం పెంచుతుందని, కలుపు నివారించుకోవచ్చన్నారు. 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు వర్షాధారం తోటలలో ప్రతి చెట్టుకు 3 కిలోల యూరియా, 5 కిలోల సూపర్ ఫాస్పేట్, 1.5 కిలోల మ్యూరెట్ ఆఫా పొటాష్ వేయాలన్నారు. నీటి వసతి కల్గిన తోటలలో 1 కిలో యూరియా, 5 కిలోల సూపర్ ఫాస్పేట్‌తోపాటు 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేసుకోవచ్చన్నారు. పిందెలు గోలీ సైజులో ఉన్నప్పుడు మిగతా 1 కిలో యూరియా, 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలని సూచించారు. జూలై, ఆగస్టు నెలల్లో పచ్చిరొట్టె పంటలైన జనుము, జీలుగ, పెసర, అలసంద, ఉలవలు, పిల్లిపెసర లాంటి పంటలు వేసి పూత దశలో కలియదున్నాలని సూచించారు. జింక్, బోరాన్ దాతువుల లోపాలను నివారించడానికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 2 గ్రాముల లీటరు నీటికి లేదా ఫార్ములా – 4 పొడిని లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున కలిపి 15 రోజులు వ్యవధిలో 2–3 సార్లు పిచికారి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండ హుండీ ఆదాయం రూ.5లక్షలు

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై గల శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయ హుండీ ఆదాయం మంగళవారం లెక్కించామని ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి, చైర్మన్ మల్‌రెడ్డిలు తెలిపారు. రూ.5,43,158లు వచ్చినట్లు తెలిపారు. శివరాత్రి నుండి ఆలయంలో ఏర్పాటు చేసిన ఈ హుండీలో భక్తులు కానుకలు సమర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో రమణ, కొండకిట్ట, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లె : పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ముష్టూరు పంచాయతీ దిగువపల్లె సమీపంలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడిచేశామన్నారు. దిగువపల్లెకు చెందిన చవాన్‌గంగాసింగ్, ఎం.చంద్రాయుడు, పూజారి కృష్ణమూర్తి, కే.గంగాద్రిలను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

నేటి నుంచి చౌడేశ్వరిదేవి జాతర

రామసముద్రం : రామసముద్రం మండలంలోని గుంతలపేటలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి జాతర వార్షికోత్సవం బుధవారం నుంచి జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ధ్వజారోహణం, 15న త్రిశూలం, వసంతోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు తీసుకోవాలన్నారు.

ప్రైవేట్ టీచర్లకు సెలవులివ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని ప్రైవేట్ టీచర్లకు సెలవులు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని వారం రోజుల పాటు ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డి సర్కిల్ : డీడీయూజీకేవై పథకం ద్వారా సీడాప్ సౌజన్యంతో జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలల వ్యవధిలో ఉచితంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషనల్ సంస్థ రీజినల్ కో–ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సులలో శిక్షణతోపాటు అదనంగా బేసిక్ కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు ఉచిత వసతి, భోజనవ సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 7103665112, 9059160549 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రక్తదానం చేయండి ప్రాణాన్ని కాపాడండి



మాట్లాడుతున్న డా.శైలజ

రాయచోటి అర్బన్ : ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరో ప్రాణాన్ని కాపాడాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ శైలజ పిలుపునిచ్చారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 14న ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డైట్ కళాశాల ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. పీహెచ్‌సిలలో పనిచేసే సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, యువకులు, విద్యార్థులు అందరూ పాల్గొని రక్తదానం చేయాలంటూ కోరారు. రక్తదానం చేయదలచుకున్న వారు ఉదయం 9గంటలకు శిబిరం వద్దకు విచ్చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రక్తదానం చేసినవారికి ప్రశంసాపత్రాలను అందజేస్తామని తెలిపారు. సమావేశంలో రాయచోటి డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, ఆరోగ్య అధికారి బలరామరాజులు పాల్గొన్నారు.

పాడిరైతులకు అందుబాటులో ఉండండి



మాట్లాడుతున్న డా.లక్ష్మీదేవి

సిద్దవటం : పశు సంవర్ధక శాఖ అధికార, సిబ్బంది సమయపాలన దిశగా విధులు నిర్వహించాలని సిద్దవటం ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీదేవి సూచించారు. మండల కేంద్రమైన సిద్దవటం లోని పశువుల ఆసుపత్రిలో మంగళవారం సిద్దవటం, అట్లూరు మండలాల పశుసంవర్ధక శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దవటం, అట్లూరు మండలాల్లో పాడిరైతులు ఎక్కువగా ఉన్నారన్నారు. పాడిరైతులకు అందబాటులో ఉంటూ వారికి పశువులపై తీసుకోవాల్సిన జాగ్రతలు, పాల ఉత్పత్తులపై రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూడాలన్నారు. పాడి పశువుల బీమా, పల్లె ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియ జాప్యం లేకుండా సిబ్బంది అందుబాటులో ఉండి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆమె సూచించారు. కార్యక్రమంలో అట్లూరు, సిద్దవటం మండలాలకు చెందిన పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పవిత్ర హజ్ చేయడం అదృష్టం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కల్చరల్ : పవిత్ర హజ్ చేయగల్గడం అదృష్టమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష తెలిపారు. మంగళవారం కడప నగరం కృష్ణా సర్కిల్‌లోని షాహి దర్బార్ సమావేశ మందిరంలో స్థానిక ట్రావెల్స్ అధినేత అస్మతుల్లా ఆధ్వర్యంలో పవిత్ర హజ్ యాత్రికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ పవిత్రమైన హజ్ యాత్ర చేస్తున్న వారంతా ఎంతో అదృష్టవంతులుగా భావించాలన్నారు. వారందరికీ దైవ కృప ఉండడంతోనే ఈ అవకాశాన్ని పొందగలుగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా హజ్ యాత్రలో పాటించాల్సిన నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి యాత్ర నిర్వాహకులు యాత్రికులకు తెలిపారు. అనంతరం వారికివ్యాక్సినేషన్ చేసి యాత్రకు అవసరమైన కిట్లతో కూడిన వస్తువులను అందజేశారు.